
# సంఘర్షణ

- పంజాల జగన్నాథం



ఒకటే ఆలోచనలు. బుర్రని తొలిచేస్తున్నాయి. తల బద్దలయ్యేలా ఉంది రామనాథంకు.

'వీడెంత పనిచేశాడు' తనలో తాను గొణుక్కోసాగాడు రామనాథం.

'నాన్నా! యం.యస్.సి. ఫలితాల్లో ర్యాంకు రాలేదు. వేరే స్టేట్‌లో డొనేషన్ కట్టి యం.యస్.సి. మైక్రోబయాలజీ చదువుతాను' అని తన పెద్దబ్బాయి అంటే సరేనన్నాడు.

రామనాథం తన కొడుకుతో కాలేజీ క్యాంపస్‌లో అడుగుపెట్టాడు. ఓ రెండు రోజులకు సరిపడా బట్టలు సర్దుకుని మరీ వచ్చాడు. రామనాథం కొడుకు సంబంధిత సర్టిఫికెట్ల ఫైలుతో

వాళ్ల నాన్న వెంటే ఉన్నాడు.

రామనాథం క్యాంపస్ పరిసరాలను చూస్తూనే ఆశ్చర్యపోయాడు. కళ్లు మిటకరించి మరీ చూడసాగాడు. ఉదయం పదిగంటలు. నీరెండ కాస్తోంది. క్యాంవస్ గ్రౌండ్ అంతా పచ్చికబయలు, పలురకాల పూలమొక్కలు... మధ్య మధ్యన సిమెంటు రోడ్లు... రోడ్లకిరువైపులా గుల్‌మొహర్లు ఎర్రని పూలతో రక్తవర్ణమై ఉన్నాయి. గార్డెన్‌లో అక్కడక్కడా వివిధ రకాల జంతువుల ఆకారాల్లో కత్తిరించబడిన పొదలు... తోటలో ఘుమఘుమలనా విరగబూసిన నందివర్ధనం, గులాబీలు, చామంతి మొదలగు అనేక పూలమొక్కలు. మధ్యమధ్యన నేర్పుగా, కూర్పుగా అమర్చిన పసుపు పచ్చటి పూలగుత్తుల గన్నేరులు. ఓ అర ఫర్లాంగు దూరంలో స్వాగతం పలుకుతున్న పామ్ చెట్లు. ఆ వెనుక నమ్రతకు సింబల్‌గా వినయంగా నిలబడ్డ అశోక, సరుగుడు చెట్ల వరుసలు.

ఇవన్నీ దాటుకుంటూ వెళ్లాడు రామనాథం. తన కొడుకుతో సహా. ఎదురుగా సువిశాలమైన మూడంతస్తుల కాలేజి భవన సముదాయం. కొద్ది దూరంలో వాహనాల పార్కింగ్ ప్లేస్. కాలేజి పాల పర్వతంలా తెల్లగా మెరుస్తోంది. కాలేజీకి అభిముఖంగా సిమెంటుతో చేయబడిన పాండ్. మధ్యలో ఫౌంటెన్ నీటి తుంపరలను చుట్టు వెదజల్లుతోంది. పాండ్‌లో తామరలు. తామరాకులపై నీటి బిందువులు తెల్లగా మెరుస్తున్నాయి. పాండ్ చుట్టూరా పుడమి అందిస్తోన్న పూలగుచ్ఛాల్లాంటి ఎర్రని ఎక్సోరా పూపొదలు.

కళాశాలకు బహుళ సంఖ్య చలువరాతి మెట్లు. మొఘల్ దర్బారు నమూనాలో విశాలమైన ప్రవేశ ద్వారం. ప్రవేశానికి ఇరువైపులా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేయబడిన గంభీరమైన మృగరాజుల ప్రతిమలు. హిందూ, పార్శీ శిల్పికలను ప్రతిబింబిస్తూ బలిష్టమైన స్తంభాలపైన బరువైన గుమ్మటాకారపు పురాతన శిఖరాలు గత వైభవాన్ని చాటుతున్నాయి. అరబ్బీ, కాలిగ్రఫీ మాలికల్ని డిజైన్లుగా అల్లిన లోకప్పు. కల్లోలాలు, కలహాలు కళ్లెదుట జరుగుతున్నా, జడివానలు, హోరుగాలులు మేనిపై దాడి చేస్తున్నా శతాబ్దాల నుండి చలించకుండా, మొక్కవోని దర్పానికి, సడలని స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన కళాశాల భవనం, ఉదయ కిరణాలలో తడుస్తూ, వినీలాకాశంలో విస్పష్టమైన కటౌట్‌లా ఉంది.

ట్రింగ్‌గ్గ్... అలారం మోగింది. భవనం అంతా రీసౌండ్. జీన్సు, సీతాకోకచిలుకలు, తూనీగలు, తెల్ల కుందేళ్లు, షీఫాన్లు, జార్జెట్లు, సూట్లు, బూట్లు 'టకటక'మంటూ మెట్లెక్కుతున్నాయి. రామనాథం స్వప్నంలో ఇంద్రలోకాన్ని చూస్తున్నట్టుగా అనుభూతి చెందుతున్నాడు. డొనేషన్, ఫీజు డబ్బులు చెల్లించి కొడుకుకు కాలేజీలో అడ్మిషన్ ఇప్పించాడు. హాస్టల్‌లో చేర్పించాడు. రెండు సంవత్సరాలు గడిచింది. కొడుకు శ్రద్ధగా చదివి సర్టిఫికెట్ తేవాల్సిందిపోయి ప్రేమా, దోమా అంటూ క్లాస్‌మేట్‌ను, కులంగాని అమ్మాయిని పెళ్లిచేసుకుని తీసుకొచ్చాడు. కనీ, పెంచీ పెద్దజేసి విద్యాబుద్ధులు నేర్పిన్నా బతకడానికి ఒక దారంటూ ఏర్పరస్తున్నా... కన్న తల్లిదండ్రులకే కనీస మాత్రం తెలుపలేదని రామనాథం లోలోన ఎంతో మధనపడసాగాడు. తల్లిదండ్రులకు, కొడుక్కి మధ్యన ఉండే సంబంధమింతేనా? తండ్రి కేవలం డబ్బులిచ్చే యంత్రమేనా? తన కుటుంబం గురించి కానీ, ఈ సమాజం గురించి కానీ ఆలోచించాల్సిన బాధ్యత కొడుకులకు లేదా?' రామనాథం మస్తిష్కంలో అనేక ఆలోచనా తరంగాలు సుడులు తిరిగి అలజడిని, అశాంతిని రేపుతున్నాయి. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకుని సుఖంగా కాపురం చేసే స్థాయికి ఈ సంఘం ఎదగలేదని రామనాథం భావిస్తున్నాడు. సంఘంలో, బంధువుల్లో రామనాథం తలెత్తుకోలేకపోతున్నాడు. తన పరువంతా గంగలో కలిసినట్టుగా ఫీలవుతున్నాడు.

రామనాథం బి.కాం. చదివాడు. కానీ ఆ చదువు ఆయనకు ఉద్యోగాన్ని ఇప్పించలేకపోయింది. బతకడానికి ఏదో ఒకటి చేసుకోవాలి. అలా అనుకుని గ్రాడ్యుయేట్

అన్‌ఎంప్లాయ్ కింద బ్యాంకులో లోన్ తీసుకుని లారీ కొనుక్కున్నాడు. లారీకి ఓనర్-కం-డ్రైవర్ అయ్యాడు. ట్రాన్స్‌పోర్టు బిజినెస్‌లో స్థిరపడ్డాడు. రామనాథంకు సంతానం నలుగురు. ఇద్దరు ఆడ, ఇద్దరు మగ. పెద్దమ్మాయి ఎం.ఏ. పెళ్లి చేశాడు. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. అల్లుడు ధాన్యం బిజినెస్ చేస్తూ ఉంటాడు. వాళ్ల కుటుంబం సాఫీగానే సాగుతోంది. రెండో అమ్మాయి యూనివర్శిటీలో ఎం.ఎస్‌సి. బయోకెమిస్ట్రీ చేస్తోంది. పెళ్లి కావలసిన అమ్మాయి. చిన్నబ్బాయికి చదువబ్బలేదు. ఎస్ఎస్‌సితో చదువు ఆపేశాడు. తండ్రి లైన్‌లోనే తండ్రి వద్దనే క్లీనర్‌గా జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. పెద్దబ్బాయికి చదువు మీద శ్రద్ధాసక్తులు ఉన్నాయని ఇక్కడ సీటు దొరకకపోయినా వేరే రాష్ట్రానికి పంపించి చదివించాడు.

రామనాథం కొడుకు ప్రేమించి పెళ్లిచేసుకున్న ఆ అమ్మాయికి తల్లి ఒక్కతే ఉంది. తండ్రి చనిపోయాడు. ఆమె సిటీలో ఏదో ఆఫీసులో పనిచేస్తోంది. ఆ అమ్మాయికి ఒక అన్న ఉన్నాడు. అతను బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఓ మోస్తరుగా బతుకుతున్న కుటుంబం. సాంప్రదాయాలను పట్టుకుని వేలాడే మనుషులు. కులం పట్టింపు ఉన్నవాళ్లు కనుక చెల్లితో తెగతెంపులు చేసుకున్నట్టుగానే మాట్లాడాడు అన్నయ్య. తల్లీ, అన్నయ్యలను ఎదరించి రామనాథం అబ్బాయిని కులాంతర వివాహం చేసుకుంది. 'భావనా ఎంత పనిజేస్తివే' అంటూ బిడ్డను తిట్టింది. కొట్టింది.

'అమ్మా! ఇప్పటికయినా వాణ్ణి విడిచిపెట్టి రా. లక్షల్లో కట్నమిచ్చి స్టేట్స్‌లో ఉన్న అబ్బాయితో ఘనంగా పెళ్లి చేస్తా. జీవితం సుఖంగా గడుస్తుంది. వీడేం నిన్ను సుఖపెడతాడు' అంటూ కూతుర్ని బుజ్జగించింది. ససేమిరా వినలేదు. 'అతనితోటే నా జీవితం. అతనే నా సర్వస్వం' అంటూ మొండికేసింది. అబ్బాయి ఆర్థికంగా వెనుకబడినవాళ్లే. అబ్బాయి ఆరడుగుల అందగాడేమీ కాదు. మరి ఆ అమ్మాయి ఆ అబ్బాయిలో ఏం చూసి ఇష్టపడ్డదో. 'ప్రేమ గుడ్డిది' అంటే ఇదేనేమో. అనుభవం లేని వయసులో 'యవ్వన ఆకర్షణ' వీళ్లిద్దరినీ ఏకం చేసింది. రిజిస్ట్రార్ ఆఫీసులో కాలేజి ఫ్రెండ్స్ సమక్షంలో పెళ్లిబంధంతో ఒకటయ్యారు. ఈ చర్య వల్ల తమ తల్లిదండ్రులు ఎంత ఆవేదన చెందుతారో అని ఒక్క క్షణం ఆలోచించలేదు.

ఇలాంటి పెళ్లిళ్లు మనగలుగుతాయా! రామనాథంకయితే నమ్మకం లేదు. ఆర్థిక సమస్యలు లేనంతవరకు ప్రేమ పెళ్లిళ్లు సజావుగానే వుంటాయి. డబ్బులు లేనప్పుడే వాళ్ల దాంపత్య జీవితంలో అసలు సిసలైన సమస్యలు మొదలవుతాయి. ఎంత అన్యోన్యతనైనా దెబ్బతీస్తుంది. రామనాథంకు వీళ్ల పట్ల ఓవైపు జాలి, మరోవైపు కోపం కలుగుతుంది.

రామనాథం లారీ ద్వారా సరుకులు, ధాన్యం, ఫర్టిలైజర్ రవాణా చేసే బిజినెస్. ఈమధ్య ఈ బిజినెస్ పడిపోయింది. అరకొరగా నడుస్తోంది. వానలు లేవు. పంటలు లేవు. ధాన్యం లేదు. పండ్ల తోటలు కాయలేదు. ట్రాన్స్‌పోర్టు గిరాకీ బాగా పడిపోయింది. లారీ ఇంటిముందరే ఉంటోంది. రామనాథం సంసారం నల్లేరు మీద నడకలా అయింది. రామనాథం చిన్నమ్మాయి పెళ్లికెదిగింది. యూనివర్శిటీ చదువు. ఈ రోజుల్లో పెళ్లంటే మాటలా! లక్షల్లో కట్నాలు, కానుకలు... మధ్యతరగతి వాళ్లకు తలకు మించిన భారమవుతోంది. పైపెచ్చు పెద్దబ్బాయి కులంకాని అమ్మాయిని పెళ్లిచేసుకుని సాంఘిక సమస్య తీసుకొచ్చాడు. ఈ విషయం చిన్నమ్మాయి పెళ్లికి అడ్డంకిగా మారింది. ఎంత కంప్యూటర్ యుగమయినా సమాజం ఇంకా అంత విశాలంగా ఎదగలేదు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

'ఏమిటండీ! మీలో మీరే గొణుక్కుంటున్నారు' అంటూ చాయ్ కప్పుతో ప్రత్యక్షమయింది. రామనాథం భార్య జగదాంబ తన భార్య మాటలతో ఆలోచనల ఊబి నుండి బయటపడ్డాడు.

'ఏం లేదోయ్! పెద్దబ్బాయి విషయమే నా మెదడుని తొలిచేస్తోంది' అంటూ భార్య నుండి

చాయ్ కప్పు అందుకున్నాడు.

'మరీ మీ మనస్సును అంతగా పాడుచేసుకోకండి. ఈ తరం పిల్లలు పెద్దల చెప్పుచేతల్లో ఉంటారనుకోవడం భ్రమేనండీ. గట్టిగా మందలిస్తే ఏదో అఘాయిత్యానికో పాల్పడతారు. జరిగిందేదో జరిగింది. ఇప్పుడు మనం వాళ్లకనుగుణంగా సర్దుకుపోవడమే శ్రేయస్కరం' అంటూ భర్తకు నచ్చజెప్పింది.

జగదాంబ గ్రాడ్యుయేట్. కానీ తను వంటింటికీ, తన సంసారానికి మాత్రమే పరిమితమయింది. 'కార్యేషుదాసి'లా కష్టనష్టాల్లో భర్తకు చేదోడువాదోడుగా ఉంటోంది. ఆమెకు పిల్లల్ని క్రమశిక్షణగా పెంచడం ఒక్కటే తెలుసు. పెద్దబ్బాయి చేసిన పనికి అంతర్గతంగా ఆమె కూడా మధనపడుతోంది. కానీ భర్తకు తెలిస్తే ఎక్కడ బెంబేలు పడిపోతాడోనని పైకి ధైర్యంగా కనబడసాగింది.

'అమ్మా!' అంటూ చిన్నకూతురు రమ్య కాలేజీ నుండి అక్కడికి చేరుకుంది. ఆమె రాకతో సంభాషణలు ఆగిపోయాయి.

'అమ్మా! ఏంటీ నేను రాగానే మాటలు ఆపేశారు.'

'ఆఁ ఏం లేదమ్మా! అన్నయ్య పెళ్లి సంగతి నీకు తెలియంది కాదు. నాన్న లోకానికి భయపడుతున్నాడు. అనవసరంగా టెన్షన్‌తో ఆరోగ్యం పాడుచేసుకుంటున్నాడు. ఆ టెన్షన్ వద్దని నాన్నతో చెబుతున్నాను.'

'నిజమే జగదాంబా! నీవు ఈ నాలుగు గోడల మధ్య ఉన్నదానివి. నీకు నీ పిల్లలు తప్ప బయటి ప్రపంచం తెలియదు. నొసటితో వెక్కిరిస్తుంది. నోటితో నవ్వుతుందీ సమాజం.'

'నిజమే నాన్నా! సమాజం నీవనుకున్నంత ఇదిగా లేదు. ఈ రోజుల్లో ఇలాంటి పెళ్లిళ్లు మామూలే. మారుతున్న సమాజానికి అనుగుణంగా మీరూ మారాలి. కులాలూ, మతాలూ, ఈ సాంప్రదాయాలూ, చట్టుబండలూ అన్నీ మనం కల్పించుకున్నవే.'

చిన్నకూతురు రమ్య వైపు ఆశ్చర్యంగా చూడసాగాడు రామనాథం ఆమె మాటలు వింటూ.

రామనాథం రమ్య పట్ల ఓ చిరునవ్వు నవ్వి, 'కులరహిత సమాజ నిర్మాణం కోసం 'స్వకుల వివాహాల'ను నిషేధించాలని చట్టం తీసుకొచ్చినా ఆచరణలో సాధ్యం కాదమ్మా. ప్రస్తుతం వరకట్న నిషేధ చట్టం అమల్లో ఉంది. ఆచరణలో జరుగుతున్నదేమిటి? కేవలం చట్టాల మూలంగా

## మర్రిచెట్టు నా నేస్తం

- జానకీ జాని.

రెండు పెగ్గుల నిరాశని నీట్‌గా పుచ్చుకుని
ఆకాశంలో నక్షత్రాలు లెక్కపెడుతూ
కూచున్నాను
చంద్రుణ్ణి ఓడించాలని పరిగెత్తే మేఘాలు
ఇవ్వాళ నా ఆలోచనలకి రెక్కలు
పాత బట్టలన్నీ బయటికి కసిగా విసిరేసి
అన్నీ కొత్తవే కుట్టించుకోవాలని
ఎప్పటినుంచో అనుకుంటాను నేను
చిరిగిన పాతవాటి స్థానంలోనే కొత్తవి
వెలుస్తాయి
అశాంతియుత సహజీవనానికి
అలవాటు పడుతుంది మనస్సు
తోడూ నీడా లేకుండా ఊరవతల మైదానంలో
ఏకాకి జీవితం గడిపే మర్రిచెట్టంటే
చెప్పలేనంత అభిమానం సానుభూతీ నాకు
శాలువాలూ సన్మానాలూ కోరదు సరిగదా
మనసిచ్చి పలకరించే స్నేహితులన్నా లేకుండా
దూరంగా, దూరంగా ఏకాంతవాసం చేస్తుంది
ఎవ్వరూ లేకుండా చూసి మర్రిచెట్టు భుజం తట్టి
"భయపడకు మిత్రమా! నేటి నుంచీ మనకు
నేస్తం" అన్నాను
"ఎన్నేళ్ల నుంచో గాలితో ఈ విషయమే
కబురంపుతున్నాను-
ఇన్నాళ్లకి నా భాష అర్థమయింది నీకు".

సామాజిక మార్పును సాధించలేం. మనిషి ఆలోచనా విధానంలో మార్పును తీసుకు రావాలమ్మా! పరిపూర్ణంగా ఎదగని ఈ సమాజంలో వీళ్లెట్లా బతకగలరనేదే నా బాధమ్మా!'

ఇంతలో అక్కడికి చేరుకున్న రామనాథం పెద్దబ్బాయి, అతని భార్య భావన వీళ్ల సంభాషణంతా శ్రోతల్లా వింటున్నారు.

మధ్యలో రామనాథం పెద్దబ్బాయి కల్పించుకుని, 'అర్థమయింది నాన్నా మీ ఆవేదన. ఆర్థిక స్వావలంబన కోసం నేనూ, భావనా ప్రయివేటు ఉద్యోగం చూసుకుంటాం. మన కుటుంబానికి సాంఘికపరమైన సమస్యలు రాకుండా ఉండడానికి వేరుగా ఉంటాం. ఉద్యోగాలు దొరికాక మన కుటుంబానికి మా చేతనయినంత ఆర్థికంగా సహకరిస్తాం. చెల్లి పెళ్లి పట్ల నా బాధ్యతను మర్చిపోను నాన్నా!' అంటూ వినమ్రంగా చెప్పసాగాడు.

'మామయ్యా! ప్రభుత్వం కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నట్టు మాస్ మీడియా ద్వారా తెగ ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారం ద్వారా మనం కోరుకునే మనిషి యొక్క మానసిక మార్పు రాదు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు, వారి సంతానానికి సామాజిక భద్రత, ఉపాధికల్పన ఏర్పరచినపుడు మనం ఆశించే కుల, మతరహిత సమాజం ఏర్పడే అవకాశాలు మెరుగవుతాయి. ఈ పిల్లలేంటీ, వీళ్ల అనుభవమేమిటీ ఇంత విశ్లేషణాత్మకంగా మాట్లాడుతున్నారని మీరు ఆశ్చర్యపోతున్నారేమో. కానీ ఇది నగ్నసత్యం!'

'అమ్మా భావనా! యూనివర్శిటీలో చదువుకున్నది వేరు, నిజ జీవితంలోని అనుభవాలు వేరు. సిద్ధాంతాలు ఎన్నయినా చెబుతాం. ఆచరణలోనే ఉంటుంది ఇబ్బంది. హిందువుల్లో అత్యధికులు కులాంతర వివాహాలను అంగీకరించరు. కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మనః స్థితి. కులాన్ని తొలగించడం అంటే భౌతికంగా ఒక అడ్డంకిని తొలగించడం కాదు. మానసిక పరివర్తనను సాధించడం. ప్రజల విశ్వాసాలను, భావాలను శాస్త్రాలు శాసిస్తున్నంత వరకు ఆదర్శాలను సాధించడం కష్టమమ్మా!' రామనాథం ఉద్బోధిస్తున్నట్టుగా చెబుతున్నాడు.

'నాన్నా! ముందు శాస్త్రాల అధికారాన్ని ప్రశ్నించకుండా అవి చెప్పే సిద్ధాంతాలను పవిత్ర భావంతో నమ్మి అనుసరించే ప్రజల్ని విమర్శించకుండా వారిలో మానసిక పరివర్తన కొరకు ప్రయత్నించాలి' అంటూ రామనాథం చిన్నకూతురు రమ్య తండ్రితో చెబుతోంది.

'బిడ్డా! కొందరు కొన్ని విశ్వాసాలను ఆలంబనగా చేసుకుని కులాలను, మతాలను సృష్టించారు. వాటికి దైవికతను, పవిత్రతను ఆపాదించారు. వాటిని నిర్మూలించే సంస్కరణలు రావాలి. అప్పుడుగాని కులాంతర వివాహాలు సాధ్యం కావు. కులాంతర ప్రేమ వివాహం చేసుకునే వధూవరుల్లో దృఢ నిశ్చయం ఉండాలి. దానికి సెంటిమెంట్ల తూట్లు కొట్టకుండా సంరక్షించుకోవాలి. ఇలాంటి యువ జంటలకు మానసిక, భౌతిక, సామాజిక అవగాహన ఉండాలి.

భార్య జగదాంబ మాటలు వింటూ రామనాథం ఆశ్చర్యంగా నోరెళ్లబెట్టాడు.

'ఏమోయ్ భలే! బి.ఎ. ఆర్ట్స్ అంటే ఏవో వానాకాలపు చదువు లనుకున్నాను. సొంతంగా సామాజిక సారాన్నే చెబుతున్నావ్' అంటూ భార్యను మెచ్చుకోలుగా చూస్తూ అభినందించాడు.

రామనాథం ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు. తన సంరక్షణలో వాళ్ల కాపురం సవ్యంగా జరగాలని భావించాడు. రామనాథం ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్యన దీర్ఘంగా చర్చించుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుండి సుడిగాలిలా ఊడిపడ్డది భవానీ తల్లి. జుట్టంతా చెదిరిపోయి ఉంది. తెల్లని దుస్తులు ధరించింది. ఒక చేతికి రోల్డ్ గోల్డ్ వాచీ, మరో చేతికి బంగారు గాజు ఉంది. నుదుట బొట్టు లేదు. ఒళ్లంతా చెమట పట్టింది. మొసపోస్తోంది. మొహమంతా జేబురించి ఉంది. మొహంలో కోపం ప్రస్ఫుటంగా కనబడుతోంది. వస్తూనే, 'భావనా! ఎంత పనిజేశావే. జరిగిందంతా మర్చిపో. అతణ్ణి విడిచిపెట్టి రా. మనింటికి

వెళ్లిపోదాం' అంటూ భావన చేయి పట్టుకుని బరబరా లాక్కుపోసాగింది. తల్లీబిడ్డలు ఇద్దరూ పెనుగులాడసాగారు.

మధ్యలో రామనాథం కల్పించుకుని, 'ఆగమ్మా! అమ్మాయిని ఎందుకు ఋడిపిస్తావ్. కట్టుబాట్లు సడలించి చదువు, సమానత్వం అంటూ ఆడపిల్లను గాలికి వదిలేసి, ఇప్పుడు కొడితే, తిడితే ప్రయోజనం ఏముంటుందమ్మా! అయినా వాళ్లు చేసిన దాంట్లో తప్పేముంది. వాళ్లు మేజర్లు. ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మనం వాళ్లకు అవరోధం కాకూడదు. వాళ్ల కాపురానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత మన రెండు కుటుంబాల మీద ఉందమ్మా!' అంటూ రామనాథం సంయమనం పాటిస్తూ శాంతంగా చెప్పాడు.

'పెద్దమనిషిలా మాట్లాడుతున్నావ్. నీవూ పెద్దమనిషివేనా! నా బిడ్డను నాకు కాకుండా చేశావ్. మీ కులమేమిటి? మీ స్థాయేమిటి? మీ అబ్బాయిని క్రమశిక్షణలో పెంచకుండా, కట్టుబాటులో ఉంచకుండా దేశం మీద బలాదూర్‌గా వదిలేశావ్' అంటూ ఉక్రోషంతో శాపనార్థాలు పెట్టసాగింది భావన తల్లి.

'అమ్మా! ఊరికే నోరు పారేసుకోకు. నీవు ఏదైతే తప్పుగా భావించావో, దాంట్లో మన పిల్లలిద్దరిదీ వుంది. రెండు చేతులు కలియందే చప్పట్లు మోగవు. అనవసరంగా ఏవేవో మాట్లాడి పిల్లల్ని మనకు కాకుండా చేయకండి. పెద్దమనసుతో వాళ్లను దీవించు.'

'మామయ్యా! మా అమ్మ ఓ తరహా మనిషి. ఆమెతో ఏమీ మాట్లాడకండి. ఆమెకు ప్రేమలూ, త్యాగాలూ, బంధాలూ, అనుబంధాలూ ఇవేమీ తెలియవు. ఆమెకు తెలిసిందల్లా డబ్బూ, హోదాలు మాత్రమే.'

'ఒసేవ్ భావనా! మాటలు నేర్చావ్! ఈ పేదరికంలో నీవేం సుఖపడుతావే నాతో రా!'

'అమ్మా! మూర్ఖంగా మాట్లాడకు. మేం శాస్త్రోక్తంగా పెళ్లి చేసుకోకపోవచ్చు, కానీ ఆత్మసాక్షిగా ఇద్దరం ప్రేమించుకున్నాం. శ్రేయోభిలాషుల ముందు పెళ్లి చేసుకున్నాం. ఈ ప్రేమలోనే పారదర్శకత ఉంటుంది. త్యాగమూ ఉంటుంది. నా దృష్టిలో ఇంతకంటే పవిత్రమైంది ఏదీ లేదు. ప్రేమించిన వాడితోనే నా జీవితం. ఇంక నేనేమీ చెప్పలేను. వెళ్లిపో అమ్మా!' కళ్లల్లో నిండిన నీరు కనబడకుండా ప్రయత్నించసాగింది భావన. దెబ్బతిన్న అహంతో, అవమాన భారంతో బిడ్డవైపు కోపంగా చూస్తూ తిరుగుముఖం పట్టింది భావన తల్లి. ❑

## ఆశ

\- యన్.జయన్న.

కళ్లల్లో కాంక్షల వొత్తులు
వెలుగుతూనే ఉన్నాయి
విజయం కోసం నిర్మించిన మెట్లు
వొరుగుతూనే ఉన్నాయి
ఎన్నిసార్లు ఆత్మన్యూనత పంక్చర్ ట్యూబ్‌లోకి
ఆత్మవిశ్వాసపు గాలిని పంపినా-
తుస్సుమంటూనే ఉంది
లక్ష్యం వైపు విసురుతున్న బాణాలు
గురి తప్పుతూనే ఉన్నాయి
విజయం వైపు పరుగులు
తీయాలన్న ప్రతిసారి
అపజయాల అవమానపు గుర్తులు
చేతులు చాచి
వెనక్కి లాగుతూనే ఉన్నాయి
ఎన్ని తప్పటడుగులు పడుతున్నా
ఎన్ని ఎదురుదెబ్బలు తగులుతున్నా
నడక నేర్వాలని తపించే పసివాడిలా,
అస్తమించే సూర్యుడు
రేపు ఉదయిస్తాడని
విజయం కోసం
అర్రులు చాస్తూనే వున్నా- ఆశతో